# దర్గామిట్ట కతలు

## పండగ పూటా పస్తేనా? పలావు కూడు రవికేనా?




ఈశెద్గాలో నమాజు అయిపోయినాక ఒక్కరికి కూడా ఈద్ ముబారక్ చెప్పకుండా, ఛాతీ ఛాతీ కలిపి వాటేసుకోకుండా, చిల్లర డబ్బుల కోసం ఎంటబడే బుడబుక్కలోళ్లని పుణ్యానికి కూడా పట్టించుకోకుండా ఏందో అర్జెంటు పనున్నట్టు ఇంటికొచ్చేస్తాడు మా నాయిన.

ఆయన ఎనకనే మా అన్నా నేనూ రెడీ!

వలానొండుంటారు గదా అదీ కత.

కానీ మా నాయిన పుణ్యమా అని ఏ రంజాను పండక్కీ కూడా నస్సు నస్సు తినే బాగ్యం మాకు లేదు.

ముందు రవికి క్యారేజీ గట్టాలి. తర్వాతే మేము తినాలి. మా నాయనమ్మ, అమ్మా అయితే అప్పుడు కూడా తినేదానికి లా.

రవికి గట్టిన క్యారేజీని మా నాయిన వాళ్లింట్లో ఇచ్చొచ్చేసినాక– మా నాయిన స్నేయితులైన వలా వెంకారెడ్డి, సైకిల్‌షాపు గంగాదరం, శీనివాస ఓటలోనరు నాగబూషణం మా ఇంటికొచ్చి వండగ దావత్ చేసెల్లినాక – బొచ్చెలెత్తుకొని, బానమ్లు సర్దుకొని అప్పుడు తినాలి మా నాయనమ్మ, అమ్మ.

పాపం వాళ్లు పొద్దున్నేలేచి పరిగడుపున వంట మొదలుబెట్టి, మాంసం శుద్దం చేసుకొని, అల్లం-తెల్లగెడ్డల మసాల నూరుకొని, గోంగూర బొలుచుకొని, కట్టెల పొయ్యి మీద నస్తా బతికతా (మేము నమాజు నుంచి వచ్చే టయిముకి) అంతా రెడీ చేసి పెట్టుంటే మా నాయిననేనోడు రావడంతోటే 'మీరు తిన్నారంటమ్మే' అని అడగబల్లా!

అహ, 'రవికి క్యారేజీ గట్టారంటమ్మే?' అని అడుగుతాడు.

అడగడమేగాదు, ఆటక మీది నుంచి అయిదు డబ్బాల క్యారేజీ దించి దాని నిండుగా సాహస్తాలతో పలావు, కుర్మా, గట్టి సేమ్యాలు, పాల సేమ్యాలు దిట్టంగా బెట్టుకొని అదరాబదరాగా వెళ్లిపోతాడు. పోతా పోతా 'ఎంకారెడ్డోళ్లొస్తే కూచోమని చెప్తు' అని ఆర్డరేస్తాడు.

ప్రతి రంజాను పండక్కీ యిట్టాంటి దరువే వేసే మా నాయిన్ని చూసి 'ఈ నాబట్టకి రవి దింటే చాలు. కడుపు నిండిపోద్ది' అని సణుక్కుంటూ ఉంటుంది మా నాయినమ్మ.

ఇంతకీ ఈ రవి ఎవరో తెలియాలంటే గరానా వొంశస్తుడయిన మా నాయన పూటకు తికానా లేని కరెంటు పనోడు ఎట్టయినాడనే తమాషా కతను తెలుసుకునే పనుంది.

మా నాయినది కావలికి ఉత్తరంతట్టున్న రామాయపట్నం. తెట్టు దెగ్గిర దిగి అయిదు మైళ్లు తూర్పుకెళితే తెల్లటి యిసకా, దూరంగా బులుగు రంగులో సముద్రం అనేక మా ఊరు అవుపిస్తాయి.

మాది ఎమ్‌డన్ ఊరు.

పొట్టి పెంకుల ఇళ్లు, తాటాకు వొసారాలు, చిల్లకొమ్మలతో దడిగట్టిన స్నానాల గదులు, యాడ నాలుగడుగులు తొవ్వినా చప్పనీళ్లుబడే చుట్టు బావులు, ఉప్పు చేపలు, చెంద్వాలు, ముంత మామిడి పొళ్లు... ఒరి నాయినా... ఏడూ ఎనిమిది కిలామల్లో ఎవ్వడు ఇస్కూలికి సెలవలొచ్చినా నేనున్నానంటా ఫూ ఊర్లో తయారయిపోయేవాణ్ణి నేను. ( అప్పడక్కడ మా బందువులు చాలా మంది ఉండేవాళ్లు).

మేం పిలకాయలుగా ఉన్నప్పటి కంటే మా నాయనోళ్ల చిన్నతనంలోనే మా ఊరు ఇంకా కళగా ఉండేదంట. అలా కళగా ఉన్న రోజుల్లో ఆడ మా తాత చేపలావరం చేస్తా లాట్ గవర్నర్ అమ్మామొగుడిలా చెలాయిస్తా ఉండేవాడంట.

అప్పట్లో ఆయన చేతిలో నాలుగు నాటు పడవలు, పదిమంది పట్టెపోళ్లు, ఇద్దరు గుమాస్తాలు ఉండే వాళ్లు. చేపల ఎక్స్‌పోర్టు కోసం మా తాత రెండ్రోజులకొక తడవ మద్రాసు పొయ్యొస్తా ఉండేవాడు.

మా తాత హయాములో మాకు సముద్రం దెగ్గిర పదిహేనెకరాల సరుగుడు తోట, తెట్టు దెగ్గిర రోడ్డువారగా బెంగుళూరు మామిడి తోట, కేసరి దాన్యం – సజ్జలు పండే ఆరెకరాల పొలం ఉండేవి. (అవన్నీ నిలువుకొని ఉంటేనా... బాంచత్...యివ్వడు ఏ నవాబుకు తక్కువ గాకుండా అనుభవిస్తా ఉండేవాణ్ణి గదా. మా తాత సరుగుడు తోట కామాకితే మేం పుట్టినాక మా నాయిన పోటీబడి మామిడి తోట, పొలం కామాకినాడు. ఇప్పడు మాకు మా ఊర్లో మిగిలింది యాభై అంకణాల ఇంటి స్థలం ).

అలా డబ్బూ దస్కం తిండీ గిండీ జంజా మతంగా ఉన్న మా యింట్లో మా నాయిన ఒక్కగానొక్క మొగపిల్లోడుగా పుట్టినాడు!

దాంతో మా తాతకీ నాయినమ్మకీ మా ముగ్గురు మేనత్తలకీ చిన్నప్పట్నించి మా నాయిన ఎంత చెప్తే అంతే. ఇది గావాలంటే కావాలి, అది వద్దంటే వద్దు.

ముందు నుంచి కూడా మా నాయినకు చదువంటే బలే ఇంటరెస్టు వుండటం చూసి మా తాత ఆయన్ని ఫస్ట్ ఫారం అయిపోయినాక వెల్లూరు లోని సి.ఎం.సి. హైస్కూలులో సెకండ్ ఫారం చేర్పించినాడు.

స్కూల్లో చదువుకోవడం, కుమార్ గల్లీ (చిన్న బజారు) లోని మా పెదత్త ఇంట్లో తిని పొణుకో

# దర్గామిట్ట కతలు

వడం తప్పితే ఇంకో పని ఎరగని మా నాయినకు ఎస్.ఎస్.ఎల్.సి.లో పడింది దెబ్బ!

అది గూడా మా పెదత్త బర్తయిన నెల్లూరు సాయిబు రూపంలో...

సత్యం చెప్పాలంటే నెల్లూరు సాయిబంత సొగరుబోతోడు, జల్సా నాయాలు, శ్రీమంతుడు మా పటాలంలో ఇంకోడు లేడు. మా పెదత్త పెళ్లిలో మా తాత ఎనబై సవర్ల బంగారం పెడితే 'నేను అంత లెవిలు తక్కువోణ్ణా' అని నగల పెట్టను కాలితో తన్నాడంటే ఈయన కావరం అప్పట్లో అలాంటిది. ఒకప్పుడు కుమార్ గల్లిలో సగం అస్తులకు ఓనరయిన యీయన ఆ అస్తులను కరగబెట్టుకోవడమే గాకుండా మా తాత సగం దొవయి పోయేలా పుణ్యం గట్టుకున్నాడు. (యీయన కతలు చాలా ఉన్నాయి. మళ్లెప్పుడైనా చెబుతా)

అట్టాంటి అలివిగాని మనిషయిన నెల్లూరు సాయిబు ఒక రోజు మా పెద్దత్తను సొనగొట్టేసినాడు, 'పిలకాయలు ఎదిగొస్తున్నారు... నీ జల్సాలు మానుకోయ్యా' అని నోరు తెరిచి చెప్పిన పాపానికి.

అలా సొనగొట్టడమే గాకుండా 'నువు నాకు అక్కర్లేదు బో ' అంటా మా తాతింటికి తరిమేసినాడు.

ఆమె ఎనకనే ఏడ్చుకుంటా మా నాయినా!

ఆ రావడం రావడం మూడు నెలల దాకా మా పెదత్త పోనేలా. నెల్లూరు సాయెబు రానేలా. ఆ దెబ్బకు లక్షణంగా పరీక్షలు రాయాల్సిన మా నాయిన గోళ్లు గిల్లుకుంటా ఇంట్లో కూచుండిపోయాడు.

అప్పటికే మా తాత యాపారంలో లాసయిపోయి, మా రెండో అత్త పెళ్లికి సరుగుడు తోట అమ్మకమాకే చేతిలో డబ్బులాడక అల్లాడతా ఉన్నాడు. ఆ టయింలో మా పెదత్తొచ్చి నెత్తిన కూచోడమేగాక మా నాయిన చదువు సంకనాకిపోవడంతో ఆ చిరాకంతా మా నాయిన మీద చూపించినాడంటాయన.

ఒక రోజు మా బర్రె పేడేస్తా ఉంటే– 'యింకనువు దేనికి పనికొస్తావబయా. ఆ పేడయినా తట్టల్లోకి ఎత్తరాదా?' అన్నాడంట.

దాంతో మా నాయినకు పొడుచుకొచ్చేసింది.

'ఆహా... ఈ నాకొడుకు నన్నింతమాట అంటాడా' అని అదే రోజు రాత్రి మా ఇనపెట్టెలో నుంచి పదో యిరవయ్యో తీసుకుని చెప్పా పెట్టకుండా మాక్కోబోయినాడు.

అప్పట్లో పదో యిరవయ్యో అంటే పెద్ద డబ్బు కదా. దాంతో హాయిగా రెండు రోజులు నెల్లూరులో తిరిగినాడు. ఆ తర్వాత బస్సెక్కి నేరుగా కర్నూల్లో దిగాడు.

అక్కడ ఏం చేయాలో తెలియక చివరకు ఎవర్నో బతిమిలాడుకొని కరెంటు పనిలో చేరిపోయాడు.

అక్కడ మా నాయిన పని అలా ఉంటే ఇక్కడ మా నాయినమ్మ మా తాతని కొడుకు కోసం ముప్పతిప్పలు పెట్టి మూడు సముద్రాల నీళ్లు తాగిస్తా ఉంది. పాపం మా తాత కూడా మా నాయిన కనిపించకుండా పోయేసరికి పిచ్చోడాల తయారయి ఊరూరా తిరిగి వెతకడం మొదలుబెట్టినాడు.

ఆరు నెలలక్కూడా మా నాయిన కాణ్నుంచి ఉత్తరం పత్తరం రాకపోయేసరికి 'వారం రోజుల్లో నా కొడుకుని చూపించావో సరే సరి. లాకపోతే సముద్రంలో దూకి చస్తా' అని మా తాతకు ఫైనలు వార్నింగిచ్చేసింది మా నాయనమ్మ.

దాంతో మా తాత ఎట్టారా బగమంతుడా అనుకుంటా ఉంటే ఏడో నెలలో మా నాయిన ఊర్లోకి దిగాడు, ఒక చేతిలో కరెంటు పనితో మరో





చేతిలో ఎనబై రూపాయల తొలి సంపాదనతో!

ఇదీ మా నాయిన కరెంట్ పనోడయిన కత.

నిజానికి ఇక్కడితో కతయిపోవాల్సిందే గాని మా నాయిన మాదర్చోద్ నాకొడుకు గాబట్టి ఇంకా కత నడిపించినాడు.

మా తాత అనిన మాటను అప్పటికీ మనసులో నుంచి చెరిపేయకుండా నువ్వూ వద్దు నీ ఆస్తీ వొద్దని కావలికి వచ్చేసినాడు:

ఆడ మా నాయినకు దొరికిన గురువే పెండం రవి!

అప్పట్లో ఆయన పెద్ద ఎలక్ట్రికల్ కాంట్రాక్టరు. మంచి పలుకుబడే కాకుండా మంచి మనసు కూడా వున్న దొడ్డ మనిషి. కావల్లో దిక్కూ దివాణం లేకుండా తిరుగుతున్న మా నాయిన్ను చూసి ఆయనే పిలిచి తన చేతికిందకు తీసుకున్నాడు. అంతే గాదు, ఇంట్లో బెట్టుకొని కన్నకొడుకులా పోషించినాడు. మా నాయిన చేత పెద్ద పెద్ద పనులు చేయించి (మా ఊళ్లో సినిమా హాళ్లకే గాదు, తిరపతి రుయా ఆస్పత్రి కట్టినప్పుడు దానికి వైరింగు పని చేసింది మా నాయినే) మంచి పనిమంతుణ్ణి చేశాడు.

అందుకే మా నాయినకు రవంటే అంత బయం, బక్తి.

రంజాను పండగ వస్తే ఆయనకు క్యారేజి గట్టి తీసకెళ్లి ఇస్తేనే మా నాయినకు పండగ చేసుకున్నట్టు లెక్క. లాకపోతే లా.

ఆ సంగతి తెలుసుకాబట్టే మా నాయిన రవి క్యారేజీలో మంచి మంచి ముక్కలేసుకొని దిట్టంగా పెట్టుకొని పోయినా మా నాయినమ్మగానీ అమ్మగానీ ఎదురు చెప్పరు.

కానీ దేనికైనా మితం వుండబల్లా?

ఆ సంవత్సరం క్యారేజీ తీసకపోయి మళ్లీ క్షణాల్లో వచ్చి యింకో క్యారేజీ నిండుగా కావాలని కూచున్నాడు మా నాయిన.

'రవి కూతురూ అల్లుడు వచ్చుండారు. వాళ్లకు కూడా పలావు పెట్టబల్లా' అని డిమాండు చేసినాడు.

ఆయన డిమాండు చూసి మా అమ్మకు సర్రన ఎక్కింది.

'యాడుందయ్యా అంతా? ఏం బల్లేదులే' అంది అడ్డం చెబుతా.

మా నాయిన వింటే గదా.

'పండగ చేసుకునేది మనం దినడానికంటమ్మే. తీ గబాల్న' అని మళ్లీ రెండో క్యారేజీ తీసకబోయినాడు.

దాంతో సగం దబర ఖాళీ! మిగిలిన పలావును వెంకారెడ్డి, గంగాదరం, నాగబూషణం, మా నాయిన సొమ్ము చేసేశారు.

ఇంకేముంది?

మొత్తం దబర ఖాళీ!

అంతా అయిపోయినాక స్నేయితులను సాగనంపి, ఆకొక్క వేసుకొని, ఇంట్లో కూడయిపోయిందన్న సంగతి తెలుసుకోకుండా హాయిగా నిద్రపోతున్న మా నాయిన్ను ఉసురోమంటా చూశారు మా నాయినమ్మ, అమ్మ.

'ఈ నాకొడుకుని కని ఏనాడు బాగుపడ్డానని' అంది మా నాయినమ్మ మంటగా.

'ఈ మహానుబావుణ్ణి కట్టుకొని ఏమి సుకపడ్డానని?' అంది మా అమ్మ కచ్చగా.

ఆనేక వాళ్లిద్దరు పొయ్యిలోని బొగ్గుతో పొళ్లు తోముకొని, రొన్ని సేమ్యాలు తిని, గమ్మున పడుకున్నారు!

–మహమ్మద్ ఖదీర్‌బాబు